క్లుప్తంగా

మలేరియాపై అవగాహన అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న తూర్పుగంగవరం పీహెచ్‌సీ వైద్యసిబ్బంది

తాళ్లూరు: మలేరియా నివారణ వారోత్సవాలలో భాగంగా మండలంలోని తూర్పు గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మౌనిక, శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ ఇంట్లో, వీధుల్లో చెత్త తొలగించి నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమన్నారు. మలేరియా సబ్ యూనిట్ వైద్యుడు బసవారెడ్డి మాట్లాడుతూ ఆరుబయట నిద్రించే వారు దోమతెరలు ఉపయోగించాలన్నారు. జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు మౌనిక, శ్రీకాంత్‌రెడ్డి, బసవారెడ్డి, హెచ్‌ఈఓ కె.చంద్రశేఖర్‌బాబు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న సేవా సమితి సభ్యులు

పెద్దదోర్నాల: సత్యసాయి బాబా సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం సేవా సమితి సభ్యులు గర్భిణులు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యుల ఆధ్వర్యంలో పంపిణీ చేపట్టిన జిల్లా సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు తంగిరాల రామిరెడ్డి మాట్లాడుతూ ప్రతి నెలా 9వ తేదీ తమ సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఎంసెట్‌లో మణికంఠకు 74వ ర్యాంక్



ఉప్పాల మణికంఠనాయుడు

పుల్లలచెరువు: మండలంలోని ముటుకుల గ్రామానికి చెందిన ఉప్పాల మణికంఠ నాయుడు ఆదివారం విడుదల చేసిన ఎంసెట్ ఫలితాల్లో 74 ర్యాంకును కైవసం చేసుకున్నాడు. మణికంఠనాయుడు గతంలో విడుదల చేసిన జేఈఈ ఫలితాల్లో తన సత్తాచాటాడు. జేఈఈ మెయిన్స్‌లో 791, అడ్వాన్స్‌లో 630 ర్యాంకు సాధించి నేడు విడుదలైన ఎంసెట్ పరీక్ష ఫలితాల్లో 132 మార్కులతో 74 ర్యాంక్ సాధించాడు. మణికంఠనాయుడు ర్యాంకు సాధించడంపై గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు. మణికంఠనాయుడు మాట్లాడుతూ ఐఐటీ మంచి కాలేజీలో చదువుకుని సివిల్స్ లో మంచి ర్యాంకు సాధించాలనేది తన కోరిక అని తెలిపారు.

అడుగుకో గుంత.. తీరని చింత



ముటుకులలో గుంతలమయమైన ప్రధాన రహదారి

పుల్లలచెరువు: ఈచిత్రంలో ఉంది పుల్లలచెరువు మండలంలోని ముటుకుల గ్రామ ప్రధాన రహదారి. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనదారులు ప్రయాణిస్తుంటారు. ఈ రహదారి గుంతలు పడి ఉండడంతో వర్షం పడితే నీరు గుంతల్లో చేరి ఎక్కడ గుంత ఉంటుందో తెలియని పరిస్థితి. రహదారి అధ్వానంగా తయారవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కాలంలో కనీసం గోతులైనా పూడ్చలేదనే విమర్శలు వస్తున్నాయి. గోతులైనా పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

జగనన్న పోరుబాటను జయప్రదం చేయండి



కురిచేడులో జగనన్న పోరుబాట పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కురిచేడు: పొగాకు రైతులకు సంఘీభావం తెలిపేందుకు ఈ నెల 11వ తేదీ పొదిలి పొగాకు బోర్డుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రానున్నారని, ఆయన పర్యటనను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనరు వైవీ సుబ్బయ్య కోరారు. సోమవారం కురిచేడులోని జెడ్పీటీసీ కార్యాలయ ప్రాంగణంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులతో కలిసి జగనన్న పోరుబాట కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బయ్య, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి మాట్లాడుతూ కూటమి పాలనలో అన్నదాతలను ఆదుకోకపోగా వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో సీఎం చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. పొగాకు రైతులను పూర్తిగా విస్మరించారన్నారు. అందుకు నిరసనగా బుధవారం పొదిలిలో జరిగే జగనన్న పర్యటనకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు, కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో హాజరై పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జి.లింగారెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ నియోజకవర్గ అధ్యక్షుడు మేరువ సుబ్బారెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఊట్ల వెంకటేశ్వర్లు, పోతిరెడ్డి నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శులు అంకె గోపాలకృష్ణ, సారెడ్డి నాగిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కొలూరి నర్సింహులు, ఎంపీటీసీలు కానాల శివారెడ్డి, బి.వెంకట నర్సయ్య, నాయకులు ఎం.పిచ్చిరెడ్డి, ఎస్.ప్రతాపరెడ్డి, ఏ సుబ్బారెడ్డి, పి.వెంకట్రావు, ఏ వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, రమణారెడ్డి, పీ సుబ్బారావు, కే సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూతుబాబును కొట్టిన వారిని అరెస్టు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు

కురిచేడు: కురిచేడు ఎస్సీకాలనీకి చెందిన బరిగెల రూతుబాబును కొట్టిన మండలంలోని పడమరవీరాయపాలెం గ్రామానికి చెందిన కేశినేని సుబ్బారావు, అతని అనుచరులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని దళిత సంఘాల ఐక్యవేదిక నియోజకవర్గ సభ్యులు కోరారు. ఈ నెల 5వ తేదీ రాత్రి రూతుబాబును కులంపేరుతో దూషించి కొట్టిన వారిని అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. సుబ్బారావు, అతని అనుచరులపై సరైన విచారణ జరిపించి రూతుబాబుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఆ మేరకు పోలీస్ వారిని ఆదేశించాలని తహసీల్దార్ రజనీకుమారిని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక దర్శి నియోజకవర్గ కన్వీనర్ జీ ప్రేమ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ దండోరా రాష్ట్ర అధ్యక్షుడు గుంటు పోలయ్య, నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు, డప్పుకళాకారుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే గోవిందప్రసాదు, ఎమ్మార్పీఎస్ నియోజవర్గ నాయకుడు గూడూరి యోగేశ్వరరావు, కే జోసఫ్, కే అనిల్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

జూదరుల పట్టివేత

పుల్లలచెరువు: మండలంలోని మానేపల్లి గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న జూదరులపై ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లుగా తమ దృష్టికి రావడంతో పక్కా సమాచారంతో దాడులు నిర్వహించగా జూదం ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.10,150 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో చట్ట విరుద్ధ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం ఏదైనా ఉంటే తమకు అందజేయాలన్నారు. ఈ దాడుల్లో సిబ్బంది అరుణ్ కుమార్, నాగరాజు, వీరాంజనేయులు, శివనాగరాజు పాల్గొన్నారు.

ఆరుగురు విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థిని నౌషియా

ముండ్లమూరు (కురిచేడు): ముండ్లమూరు మోడల్ పాఠశాల విద్యార్థులు ఆరుగురికి షైనింగ్ స్టార్ ప్రతిభా అవార్డులు లభించాయి. వారందరికీ ఒంగోలులోని శ్రీ సాయిబాబా సెంట్రల్ స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా రూ.20,000 నగదు, సర్టిఫికెట్, మెడల్‌ను సోమవారం అందజేశారు. వారిలో బీ కీర్తన, పీ అశ్విని, కే బాలకృష్ణ, జి.గాయత్రి, కే ధనుష్, పి.జయత్ నాయక్ ఉన్నారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు, బోధనా సిబ్బంది అభినందించారు.

కురిచేడు కేజీబీవీ విద్యార్థినికి...

కురిచేడు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, కళాశాలలో చదువుతున్న మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ విద్యార్థిని షేక్.నౌషియాకు షైనింగ్ స్టార్ అవార్డు లభించినట్లు ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి తెలిపారు. సోమవారం ఒంగోలులో కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా రూ.20,000 నగదు, సర్టిఫికెటు, మెడల్ అందుకున్న నౌషియాను ప్రిన్సిపాల్ పద్మావతి, బోధనా సిబ్బంది అభినందించారు.

వెలగని వీధిలైట్లు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణ పరిధిలోని రాజానగర్‌లో గల పుట్ట సమీపంలో రెండు స్తంభాలకు వీధి లైట్లు వెలగని కారణంగా స్థానికులు, జగనన్న కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొండ ప్రాంతానికి దగ్గరగా ఉండటం, సమీపంలోనే పుట్ట ఉండటంతో విష సర్పాలు సంచరిస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సుమారు 40 రోజుల నుంచి వీధిలైట్లు వెలగడం లేదని స్థానికులు తెలియజేస్తున్నారు. వీధి లైట్లు వెలగడం లేదని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

గ్రామంలోనే రేషన్ సరుకులు పంపిణీ చేయాలి



తహసీల్దార్ శైలేంద్రకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న శివాపురం కార్డుదారులు

– తహసీల్దార్‌కు శివాపురం గ్రామస్తుల వినతి

పెద్దారవీడు: దేవరాజుగట్టు పంచాయతీ శివాపురం గ్రామంలో రేషన్ షాపు ఏర్పాటు చేసి సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ శైలేంద్రకుమార్‌కు గ్రామస్తులు సోమవారం స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. దేవరాజుగట్టు గ్రామ పంచాయతీ శివాపురం గ్రామం రేషన్ కార్డుదారులు దేవరాజుగట్టు గ్రామంలో ఉన్న రేషన్ షాపు డీలర్ దగ్గరకు వచ్చి సరుకులు తీసుకెళ్లడానికి చాలా ఇబ్బందిగా ఉంటుందన్నారు. కార్డుదారులు గ్రామం నుంచి దేవరాజుగట్టు గ్రామానికి రావడానికి 2 కిలోమీటర్ల దూరం ఉంటుందని, కాలినడకతో మహిళలు సరుకులు నెత్తిన పెట్టుకొని రాకపోకలు సాగించాలంటే తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో 130 రేషన్ కార్డులు ఉన్నాయని, ఇప్పటి వరకు గ్రామం నుంచి రేషన్ సరుకులు తెచ్చుకోలేదని కార్డుదారులు తెలిపారు. గ్రామానికి వచ్చి రేషన్ సరుకులు పంపిణీ చేయాలని పలుమార్లు రేషన్ షాపు డీలర్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని, షాపు దగ్గరకు వస్తే సరుకులు పంపిణీ చేస్తానని చెప్పారని తెలిపారు. పదేళ్ల నుంచి రేషన్ షాపు డీలర్ గ్రామంలో రూము తీసుకొని అవసరమైన సరుకులు దిగుమతి చేసుకొని కార్డుదారులకు పంపిణీ చేశారని గుర్తు చేశారు. డీలర్ గ్రామానికి వచ్చి కార్డుదారులైన వృద్ధుల చేత మిషన్‌లో వేలిముద్రలు చేయించుకున్నారే కానీ ఇంత వరకు రేషన్ సరుకులు ఇవ్వలేదని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గతంలో లాగా గ్రామంలో రేషన్ సరుకులు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మెట్టు భాస్కరరెడ్డి, పీ కోటిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సీహెచ్ పెద్దసుబ్బారెడ్డి, కే శ్రీనివాసులు, శివారెడ్డి, వెంకటరెడ్డి, ఎం కృష్ణారెడ్డి, రంగారెడ్డి తదితరులు ఉన్నారు. తహసీల్దార్ శైలేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు రేషన్ షాపు దగ్గరకు వచ్చి ప్రతి కార్డుదారులు సరుకులు తీసుకెళ్లాలని, రేషన్ సరుకులు గ్రామంలోనే ఇచ్చేలా ఉన్నతాధికారులకు సమాచారాన్ని తెలియజేస్తానన్నారు.

సమతుల ఎరువులతో భూమికి ఆరోగ్యం



డ్రోన్ ఉపయోగాన్ని వివరిస్తున్న ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు

దొనకొండ: గ్రామాల్లోని రైతులు సమతుల్యంగా ఎరువులు వాడుకుంటేనే భూమి ఆరోగ్యంగా ఉంటుందని కృషి విజ్ఞాన కేంద్రం నోడల్ అధికారి టి.మానస సూచించారు. మండలంలోని గంగదేవిపల్లి, పెద్దగుడిపాడు గ్రామాల్లో ప్రీ-ఖరీఫ్‌పై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సాగు ఖర్చులు తగ్గించుకోవడంపై దృష్టి సారించాలన్నారు. సేంద్రియ ఎరువులకు బదులుగా ఎక్కువగా రసాయనిక ఎరువులు వినియోగిస్తూ భూసారాన్ని క్షీణింపజేస్తున్నారని తెలిపారు. భూమి ఆరోగ్యాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్క రైతుపై ఉందన్నారు. ఖరీఫ్ సాగుకు ముందే భూసార పరీక్షలు చేయించుకుని ఎరువులను సమతుల్యంగా వాడుకోవాలని సూచించారు. ఒకే పంట వేయడం వలన తెగుళ్లు ఎక్కువగా ఆశించే అవకాశం ఉందన్నారు. తెగుళ్లకు కారకాలైన పురుగులు వ్యాధి నిరోధక సామర్థ్యాన్ని పెంచుకుంటాయని వివరించారు. పంట మార్పిడి విధానాలు అనుసరిస్తూ అవసరమైన మేరకే పురుగు మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. ఖర్చులు తగ్గించి లాభాలు పొందడంతో పాటు భూమి ఆరోగ్యాన్ని రైతులు కాపాడుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయాధికారి ఎస్. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ-పంట నమోదు, రైతులకు సబ్సిడీపై అందజేసే పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగలు, జనుము, పిల్లి పెసర వివరాలు, రైతులకు వ్యవసాయశాఖ అందిస్తున్న పథకాల గురించి వివరించారు. కోరమాండల్ వారు వ్యవసాయంలో డ్రోన్ యంత్రం ప్రాముఖ్యతను రైతులకు ప్రత్యక్షంగా చూపించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' అమలు చేయాలి



తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న సీపీఐ నాయకులు గురునాథం

పుల్లలచెరువు: రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వెంటనే అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి గురునాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన సోమవారం వినతిపత్రం అందజేసి మాట్లాడుతూ రైతులకు, భూమిలేని కౌలు రైతులకు తక్షణమే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయం అందజేయాలన్నారు. 90 శాతం సబ్సిడీతో నాణ్యత కలిగిన విత్తనాలు అందజేయాలని, ప్రతి ఏడాది పెరుగుతున్న సాగు ఖర్చులను దృష్టిలో పెట్టుకుని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి రూ.5 లక్షల వరకు పంట రుణాలు అందించాలన్నారు. గ్రామ సభలు నిర్వహించి భూయజమాని ప్రమేయం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. కౌలు రైతుల రక్షణ సంక్షేమం కోసం సమగ్రమైన నూతన కౌలు చట్టాన్ని తీసుకు రావాలన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టు, పంట కాలువలకు తక్షణమే నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలని అన్నారు. వరి పంటకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వం కూడా రైతుల పట్ల అవలంబిస్తున్న విధానాల్లో మార్పులు రావాలని, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

యర్రగొండపాలెం: రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వెంటనే అమలు చేయాలని సీపీఐ సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. రైతులకు, భూమి లేని కౌలు రైతులకు తక్షణమే అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం అందించాలని, 90 శాతం సబ్సిడీతో నాణ్యత కలిగిన అన్ని రకాల విత్తనాలు అందించాలని, పెరుగుతున్న సాగు ఖర్చులను దృష్టిలో పెట్టుకొని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి రూ.5 లక్షల వరకు పంట రుణాలు అందించాలని ఆయన కోరారు. గ్రామ సభలు నిర్వహించి భూ యజమాని ప్రమేయం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం రూ.2 లక్షల వరకు ఎటువంటి హామీలేని పంట రుణాలు కౌలు రైతులకు అందించాలని, వారి రక్షణ, సంక్షేమం కోసం సమగ్రమైన నూతన చట్టాన్ని తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె.వి.కృష్ణగౌడ్, మన్నె సాంబశివరావు, నక్కా తిరుతయ్య, మొగిలి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



గొట్లగట్టు బస్‌షెల్టర్ దుస్థితి



షెల్టర్‌లో ఖాళీ మద్యం సీసాలు

అస్తవ్యస్తంగా బస్ షెల్టర్లు

- లక్షల రూపాయలు ప్రభుత్వ ధనం వృథా
- శిథిలావస్థకు చేరుకున్న తాటిచెర్ల మోటు బస్ షెల్టర్
- గొట్లగట్టులో మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు

కొనకనమిట్ల/కొమరోలు: ప్రయాణికుల సౌకర్యార్థం లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన బస్‌షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. కొనకనమిట్లలో మండలంలోని మేజర్ పంచాయతీ గొట్లగట్టు బస్టాండ్ సెంటర్లో ప్రయాణికుల సౌకర్యార్థం గతంలో దాతల సహకారంతో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ నేడు అస్తవ్యస్తంగా మారింది. పట్టపగలే మందుబాబులు బస్ షెల్టర్‌లో మద్యం తాగి ఖాళీ గ్లాసులు, సీసాలు అక్కడే వదిలి వెళ్తుండటంతో దుర్వాసన వస్తోంది. కనీసం కూర్చోవడానికి వీల్లేకుండా పోయిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా షెల్టర్‌కు అడ్డుగా నిత్యం ఆటోలు నిలుపుతుండటం, కొందరు చిరు వ్యాపారులు తోపుడు బండ్లు అక్కడే పెట్టి వ్యాపారం చేసుకుంటుండటంతో ప్రయాణికులకు అసౌకర్యంగా మారింది.



కొమరోలు : నిరుపయోగంగా ఉన్న గుండ్రెడ్డిపల్లె బస్‌షెల్టర్

నిరుపయోగంగా బస్‌షెల్టర్లు

కొమరోలు మండలంలోని తాటిచెర్లమోటు, గుండ్రెడ్డిపల్లె, దద్దవాడ, పామూరుపల్లి గ్రామాల వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం లక్షల రూపాయలు ప్రభుత్వ ధనాన్ని వెచ్చించి బస్‌షెల్టర్లను నిర్మించారు. వీటి నిర్వహణను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అపరిశుభ్రంగా తయారయ్యాయి. దీంతో ప్రయాణికులు ఆ ఛాయలకు వెళ్లకుండా రోడ్డుపైనే వేచి ఉంటున్నారు. నిర్వహణా లోపం కారణంగా బస్ షెల్టర్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గుండ్రెడ్డిపల్లె గ్రామం వద్ద జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రెండు బస్‌షెల్టర్లు నిర్మించారు. ఊరికి దూరంగా ఉండటంతో వాటిని ఎవరూ వినియోగించడం లేదు. రాత్రి సమయంలో బస్‌షెల్టర్లలో మందుబాబులు మద్యం తాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. తాటిచెర్ల మోటు జంక్షన్‌లో దశాబ్ద కాలంగా బస్‌షెల్టర్ నిరుపయోగంగా ఉండడంతో శిథిలావస్థకు చేరుకుంది. అక్కడ ప్రయాణికులు కూర్చోవడానికి అసౌకర్యంగా ఉండడంతో ఎవరూ వెళ్లడం లేదు. ఆ ప్రాంతంలో దుర్వాసన వస్తుండటంతోపాటు పిచ్చి మొక్కలు మొలిచాయి. సంబంధిత అధికారులు స్పందించి బస్‌షెల్టర్లను వినియోగంలోకి తేవాలని స్థానిక ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



కూర్చునేందుకు అవకాశం లేక బస్ షెల్టర్ ముందు నిల్చున్న ప్రయాణికులు



కొమరోలు : తాటిచెర్లమోటు జంక్షన్ వద్ద శిథిలావస్థకు చేరి మొక్కలు మొలిచిన బస్‌షెల్టర్

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు, అతిథులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని అమ్మవారిశాలలో గత నెల 25న ప్రారంభమైన చిన్నారుల సమ్మర్ క్యాంపు సోమవారంతో ముగిసింది. వేసవి సెలవుల్లో చిన్నారులకు యోగా, సంస్కారం, పుస్తక పఠనం, సమాజంపై అవగాహన, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై యోగా గురువు వెంకటేశ్వర్లు 15 రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ డాక్టర్ కనకదుర్గ, ప్రముఖ కవి అన్నపురెడ్డి వీరారెడ్డి, డీఆర్‌యూసీసీ మెంబర్ ఆర్‌కేజే నరసింహం తదితరులు మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం యోగా గురువు వెంకటేశ్వర్లును సన్మానించారు. సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు భగవద్గీతను బహుమతిగా అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.